సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం । 25 । జూన్ । 2023



అన్నదానానికి విరాళం

ఆత్రేయపురం: ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో అన్నదానానికి గోపరాజు శిరీష్, అలేఖ్య దంపతులు (హైదరాబాద్) శనివారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహ స్వామి సన్నిధిలో నిత్యాన్నదానానికి, నిత్యాభిషేకానికి చెరో రూ.50 వేల చొప్పున ఆర్.సంధ్య, కుటుంబ సభ్యులు శనివారం విరాళం సమర్పించారు.

గరిష్టం/కనిష్టం
31.0°/24.5°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	31.0	25.00
కాకినాడ	28.0	24.5
అమలాపురం	30.0	26.0

న్యూస్‌రీల్

జూలై 4నుంచి డీసెట్ కౌన్సెలింగ్

రాజమహేంద్రవరం రూరల్: ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ డిప్లమో కోర్సు ప్రథమ సంవత్సరంలో చేరేందుకు డీసెట్-2023లో అర్హత పొందిన అభ్యర్థులకు జూలై 4 నుంచి కౌన్సెలింగ్ జరుగుతుంది. బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణసంస్థ(డైట్) ప్రిన్సిపల్ డా.ఎస్‌డీవీ రమణ ఈమేరకు ఓ ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ నమోదు, 8 నుంచి 13 వరకు సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. 14 నుంచి ప్రొవిజనల్ అడ్మిషన్ లెటర్స్ జారీ చేస్తారన్నారు. 15 నుంచి 20 వరకు బొమ్మూరు డైట్‌లో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో వెరిఫికేషన్ కి హాజరుకావాలన్నారు. ఫీజు చెల్లించి ఫైనల్ అడ్మిషన్ లెటర్ తీసుకుని సంబంధిత కాలేజీలో చేరాల్సి ఉంటుందని ప్రిన్సిపల్ వివరించారు.

జువైనల్ జస్టిస్ యాక్ట్‌పై శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో స్పెషల్ జువెనైల్ పోలీస్ యూనిట్, చైల్డ్ వెల్ఫేర్ పోలీస్ ఆఫీసర్స్, జువెనైల్ జస్టిస్ బోర్డ్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులకు జువెనైల్ జస్టిస్ చట్టంపై శనివారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. దీనికి హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ చట్టంతో విభేదించిన బాల ల్లో పరివర్తన తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ క్రమంలో సున్నితంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పోలీసు అధికారులు, జువెనైల్ జస్టిస్ బోర్డ్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీల పాత్రను వివరించారు. బాలలకు అందించే ఉచిత న్యాయ సేవలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి తెలిపారు.

పారదర్శకంగా వలంటీర్ సేవలు



వివరాలు అడిగి తెలుసుకుంటున్న జేసీ తేజ్ భరత్

రాజమహేంద్రవరం సిటీ: జగనన్న సురక్ష పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రతీ వలంటీర్ రానున్న ఐదు రోజుల్లో ప్రతీ గృహాన్ని సందర్శించి డేటా సేకరించాలని జాయింట్ కలెక్టర్ ఎస్. తేజ్ భరత్ ఆదేశించారు. శనివారం రాత్రి జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వాంబే కాలనీ, నారాయణపురం సచివాలయాల పరిధిలో ఆయన పర్యటించారు. కొన్ని ఇళ్లకు సంబంధించి సేకరించిన డేటా పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ లబ్ధి పొందని అర్హులు ఎవరైనా మిగిలి ఉంటే జగనన్న సురక్ష పథకం ద్వారా వివరాలు సేకరించాలన్నారు. ఈనెల 30 వరకు క్షేత్ర స్థాయిలో వలంటీర్లు తిరిగి అలాంటి వారికి భరోసా కల్పించాలన్నారు.

బాలబాలాజీ స్వామికి రూ.1.98 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారిని శనివారం 3,275 మంది భక్తులు దర్శించుకున్నారు. వారి గోవింద నామోచ్చారణతో ఆలయ ప్రాంగణం ప్రతిధ్వనించింది. పవిత్ర వైనతేయ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేశారు. స్వామి వారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. తలనీలాలు సమర్పించారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.48 లక్షలు, నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలుగా రూ.50,478 కలిపి స్వామివారికి మొత్తం రూ.1,98,478 ఆదాయం సమకూరింది. 2,408 మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారని ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ జి.మాధవి తెలిపారు.



రాజానగరం నియోజకవర్గం శ్రీరంగపట్నంలో పూర్తయిన జిమ్ నిర్మాణం



కొవ్వూరు రివర్ ఫ్రంట్ నమూనా




మధురపూడి ఎయిర్ పోర్ట్ వద్ద ప్రత్యేక కుండీల్లో మొక్కలు

తలుక్‌మనేలా..

- గ్రామీణాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు రుడా ప్రణాళిక
- రూ.26.84 కోట్లతో వివిధ నిర్మాణాలకు శ్రీకారం
- అందుబాటులోకి వాకింగ్ ట్రాక్, బీచ్ ఫ్రంట్, జిమ్‌లు
- పనుల్లో ఎమ్మెల్యేల అభ్యర్థనలకు ప్రాధాన్యత



అనపర్తిలో పూర్తయిన వాటర్ ఫౌంటేన్



వాడపల్లి మాడ వీధుల్లో ఆధ్యాత్మికను సూచించే వీధి దీపాలు

సాక్షి, రాజమహేంద్రవరం: తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలను మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (రుడా) అడుగులు వేస్తోంది. ఆయా గ్రామాల్లో అందివస్తున్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ ప్రజా ప్రయోజన, ఆరోగ్య రక్షణ, ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పే పనులకు ప్రాధాన్యం ఇస్తోంది. మొక్కల పెంపకం, సంరక్షణతో పాటు గ్రామాల పేర్లను సూచించే నేమ్‌బోర్డులను అధునాతనంగా రూపొందించి ఏర్పాటు చేస్తోంది. 66 పనులకు రూ.26.84 కోట్ల నిధులు వ్యయం చేస్తోంది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకుని కొన్ని పనులు పురోగతిలో ఉండగా.. మరికొన్ని టెండరు దశలో ఉన్నాయి. రాజమహేంద్రవరాన్ని ఇప్పటికే సుందరంగా తీర్చిదిద్దిన రుడా తన పరిధిలోని గ్రామాలకు పట్టణ శోభను తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. పనులను రుడా వీసీ బాలస్వామి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

సుందరీకరణ పనులు ఇలా..

రుడా పరిధిలో నిర్వహించే పనుల్లో సుందరీకరణ, వాకింగ్ ట్రాక్‌లు, రివిట్‌మెంట్‌తో కూడిన వాటర్ బాడీ, బీచ్ ఫ్రంట్ నిర్వహణ పనులకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా మచ్చుకుకొన్ని పరిశీలిస్తే..

అనపర్తి: బలభద్రపురంలో రూ.1.65 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రివిట్‌మెంట్‌తో కూడిన వాటర్ బాడీ పనులు పూర్తి చేసింది. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా నీటితో కూడిన పార్క్, వాకింగ్ ట్రాక్, ప్రజలు సేదతీరేందుకు పచ్చదనం పెంపొందించే పనులు ప్రారంభించింది.

కొవ్వూరు: గోష్పాద క్షేత్రం సమీపంలోని కొవ్వూరు కట్ట వెంబడి రివర్ ఫ్రంట్ రూపుదిద్ది భక్తులకు స్వాంతన కలిగించేందుకు కృషి చేస్తున్నారు. పచ్చదనం పెంపొందించి అందులో వివిధ జంతువుల నమూనా విగ్రహాలు వరద నీటికి తట్టుకునే స్థాయిలో తయారు చేస్తున్నారు. ఇందుకు రూ.కోటి వెచ్చించనున్నారు. రూ.32.86 లక్షలతో అధునాతన విద్యుత్ స్తంభాలు, దీపాలు అమర్చనున్నారు. 'ఐ-లవ్ కొవ్వూరు' చిహ్నాన్ని సెల్ఫీ పాయింట్‌గా ఆధునీకరించనున్నారు.

గోపాపురం: దేవరపల్లి మెయిన్ రోడ్ నుంచి గోపాలపురం వరకు రూ.50 లక్షలతో సెంట్రల్ లైటింగ్ పనులు పురోగతిలో ఉండగా.. మరో మరికొన్ని టెండర్ స్టేజ్‌లో ఉన్నాయి.

నిడదవోలు: చిన్న కాశీ రేవు నుంచి గూడెం గేటు వరకు రహదారి నిర్మాణానికి రూ.కోటి వెచ్చించనున్నారు.

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో రూ.30 లక్షలతో జగనన్న ఉమెన్స్ హెవెన్, రూ.12 లక్షలతో ఆజాద్ చౌక్, ఎల్‌ఈడీ లైట్లు, రూ.6 లక్షలతో పుష్కరఘాట్ వద్ద దుస్తులు మార్చుకునే గది నిర్మాణం పూర్తయింది. రూ.37.50 లక్షలతో జీఎస్‌టీ రోడ్డులో మొక్కల పెంపకం, కుండీలు, మొక్కల నిర్వహణ, రూ.2 కోట్లతో హెవలాక్ బ్రిడ్జి వద్ద రంగుల విద్యుత్ దీపాలు, రూ.2 కోట్లతో కంబాలచెరువు పార్కులో మ్యూజికల్ ఫౌంటేన్ పనులు పురోగతిలో ఉన్నాయి. మరికొన్ని టెండరు దశలో ఉన్నాయి.

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ డి-బ్లాక్ వద్ద రూ.50 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మాణం, రూ.38.50 లక్షలతో కోలమూరు వద్ద అప్పన్నచెరువు పార్క్ అభివృద్ధి, రూ.47.50 లక్షలతో ధవలేశ్వరం పంచాయతీలో ఓపెన్ జిమ్, వాకింగ్‌ట్రాక్ పనులు టెండరు దశలో ఉన్నాయి.

కోనసీమ జిల్లా: ఆత్రేయపురం వార్ఫ్ రోడ్డు వద్ద రూ.1.50 కోట్లతో రివర్ ఫ్రంట్, రూ.31 లక్షలతో రావులపాలెం జంక్షన్ వద్ద క్లాక్‌టవర్ అభివృద్ధికి టెండర్లు ఆహ్వానిస్తున్నారు. వాడపల్లి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం రూ.41.70 లక్షల వ్యయంతో ఆధ్యాత్మికను సూచించే త్రిశంకు ఆకారంలో విద్యుత్ దీపాలు అమర్చే పనులు పురోగతిలో ఉన్నాయి.

రాజానగరంలో 'జిమ్'దాబాట్

రాజానగరం నియోజకవర్గంలో గాదరాడ, బూరుగుపూడి, శ్రీరంగపట్నం గ్రామాల్లో రూ.20.30 లక్షల వ్యయంతో యువతకు ఫిట్‌నెస్ పెంపొందించే జిమ్‌ల నిర్మాణం పూర్తయింది. విమాన ప్రయాణికులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు ఎయిర్‌పోర్ట్ రోడ్డు వెంబడి ఉన్న సెంట్రల్ లైటింగ్ పోల్స్‌కు రూ.55 లక్షలతో ఎల్‌ఈడీ మోటిఫ్ ఏర్పాటు. రూ.2 కోట్లతో కోరుకొండ జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్‌స్టాప్ పునరుద్ధరణకు మార్గం సుగమం కానుంది. పుణ్యక్షేత్రం వద్ద బర్డ్స్ పార్క్, 'ఐ లవ్ రాజానగరం', గ్రామ పేరు సూచించే సైన్‌బోర్డు పనులు టెండరు దశలో ఉన్నాయి.

అభివృద్ధి పనుల వివరాలు (రూ.కోట్లలో)

నియోజకవర్గం	పనుల సంఖ్య	నిధులు
అనపర్తి	02	1.65
గోపాలపురం	04	1.35
కొవ్వూరు	05	1.82
నిడదవోలు	01	1.00
రాజమండ్రి రూరల్	05	2.26
రాజమండ్రి అర్బన్	24	8.74
రాజానగరం	14	5.69
కొత్తపేట	03	2.22
రావులపాలెం	05	1.00

విస్తృతంగా సుందరీకరణ



పట్టణ, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉద్దేశానికి అనుగుణంగా రుడా పరిధిలోని ప్రాంతాల్లో సుందరీకరణ, ఆహ్లాద వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నాం. స్థానికఎమ్మెల్యేల అభ్యర్థనల మేరకు, రుడా నిబంధనలకు అనుగుణంగా పనులు చేపడుతున్నాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి జరగడం లేదన్న ప్రతిపక్షాలు బురదజల్లుతున్నాయి. కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలో చేపడుతున్న పనులను చూసైనా బుద్ధి వస్తుందని భావిస్తున్నాం.

– మేడపాటి షర్మిలారెడ్డి, చైర్‌పర్సన్ రుడా

సంక్షేమ పథకాలకు అర్హుల వివరాలు సేకరణ

జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత



రాజవోలు గ్రామంలో జగనన్నసురక్ష ఇంటింటి సర్వేలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్: ఇంటింటి సర్వే ద్వారా సంక్షేమ పథకాలకు అర్హులైన వివరాలను సేకరించాలని కలెక్టర్ మాధవీలత వలంటీర్లను,సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. శనివారం రాజవోలులో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలతో వలంటీర్లతో కలెక్టర్ మాట్లాడారు. అర్హత ఉన్న లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు తప్పకుండా చేరాలనేదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమన్నారు.

ఈ నేపథ్యంలోనే జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టామన్నారు. ఈనెల 30వరకు ప్రతి ఇంటికి వెళ్లి పథకాలు అందని అర్హులను గుర్తించాలన్నారు. పథకం అర్హత ఉండి లబ్ధిదారు కాకపోతే అవసరమైన రికార్డులను సేకరించాలన్నారు. దీనిపై వలంటీర్, గ్రామ కార్యదర్శులు దృష్టిపెట్టాలన్నారు. జగనన్న సురక్ష సమయంలో 11 రకాల సేవలు ఉచితంగా ఎటువంటి రుసుము లేకుండా అందించాలన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కలుగజేయాలన్నారు. జూలై 1 నుంచి 23 వరకు గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. మండల ప్రత్యేకాధికారి జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి కె.జ్యోతి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, తహసీల్దార్ పైడి చిన్నారావు, డిప్యూటి తహసీల్దార్ రత్నసాగర్,పంచాయతీకార్యదర్శి జి.కాశీ విశ్వనాథ్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటింట సర్వే..

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జగనన్న సురక్ష కింద శనివారం నుంచి ఈనెలాఖరు వరకూ జిల్లావ్యాప్తంగా 6,51,189 గృహాలను వలంటీర్లు , గృహ సారథులు సందర్శిస్తారు. పథకాలు అందని లబ్ధిదారుల వివరాలు సేకరిస్తారని కలెక్టర్ మాధవీలత తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెలగపూడి నుంచి వీడియో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఇక్కడి కలెక్టరేట్ నుంచి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే మండల పరిధిలో డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో అవగాహన కల్పించాన్నారు. 512 గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని సచివాలయాలకు చెందిన 3,937 కార్యదర్శులు, 8,933 మంది వలంటీర్లకు రూట్ మ్యాప్ మేరకు ఇంటింటి సర్వే ప్రారంభించారన్నారు. జగనన్న భూ హక్కు, భూ రక్షా పథకం కింద 272 రెవెన్యూ గ్రామాల్లో 2449.75 చరదపు కిలోమీటర్ల మేర సర్వే చేపట్టవలసి ఉండగా, రెండోదశలో 11,360 రాళ్ల పాతే ప్రక్రియ పూర్తయించదన్నారు. 52 గ్రామాల్లో, మూడు పట్టణ ప్రాంతాల్లో డ్రోన్ సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 1,101 భవన నిర్మాణ పనులకు గాను 800 భవనాలు పూర్తిచేశామన్నారు. 169 నిర్మాణాలు పురోగతిలో ఉన్నట్లు వివరించారు. 390 సచివాలయ భవనాలకు గాను 328 భవనాలు, 373 ఆర్బీకేలకు గాను 268, 338 వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్స్ కు గానూ 204 భవనాలు పూర్తి చేశామన్నారు. జగనన్న కు చెబుదాం గురించి ప్రస్తావిస్తూ ఇప్పటివరకూ 2,551 అర్జీలు రాగా 1,827 పరిష్కారించినట్లు కలెక్టర్ చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అర్జిదారులను కలవాన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్, డి ఆర్వో జి. నరసింహులు, ఆర్డీవో లు ఎస్. మల్లి బాబు, ఎ. చైత్ర వర్షిణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్ ఏ) టిఇఎం రాజు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈ అవార్డు రాజమహేంద్రికే అంకితం

ఎంపీ మార్గాని భరత్‌రామ్



విమానాశ్రయంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్ స్వాగతం

మధురపూడి: దుబాయ్‌లో ఇండో అరబ్ ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు-2023 అందుకుని శనివారం నగరానికి చేరుకున్న ఎంపీ భరత్‌రామ్‌కు ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డు రావడానికి నగరవాసులే కారణమన్నారు. దానిని రాజమహేంద్రికే అంకితమిస్తున్నట్టు తెలిపారు. జగనన్న హరిత నగరాల పిలుపునకు స్పందించి చేపట్టిన కార్యక్రమమే యువతా-హరితా కార్యక్రమమన్నారు. వైఎస్సార్ సీపీ నగరశాఖ అధ్యక్షులు అడపా శ్రీహరి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు గజమాలలు, శాలువాలు, పూలమాలతో ఘన స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టు నుంచి రాజమహేంద్రవరం వరకూ మోటార్ సైకిళ్లు, కార్లతో భారీ ఊరేగింపు నిర్వహించారు.

నూరుశాతం విద్యాకిట్ల పంపిణీ పూర్తి

అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్



మాట్లాడుతున్న డీఐ బి.దిలీప్‌కుమార్

కంబాలచెరువు: కొత్త విద్యా సంవత్సరాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని స్కూల్స్ అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రభుత్వ, మునిసిపల్, ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలు తెరిచే నాటికే జగనన్న విద్యా కిట్లు(జేవీకే) అందజేసిందన్నారు. వాటిని నూరుశాతం విద్యార్థులకు అందచేసి తల్లిదండ్రులతో వేలిముద్రలు (బయోమెట్రిక్) తీసుకోవాలన్నారు. ఈ నెల 26, 27 తేదీల్లో పేరెంట్ కమిటీ మీటింగ్ నిర్వహించాలన్నారు. అకడమిక్ అంశాలు, ప్రభుత్వం అందచేసిన జేవీకే కిట్ల వివరాలు తెలియజేయాలన్నారు. విద్యార్థిని స్కూలుకు విధిగా యూనిఫారంతో పంపాలని తల్లిదండ్రులకు సూచించాలన్నారు. జూలై మొదటి వారంలో ప్రిన్సిపల్ సెక్రటరీ నేరుగా తల్లిదండ్రులకు ఫోన్ చేసి జేవీకే కిట్లపై ఆరా తీస్తారన్నారు. జేవీకే స్టాక్ రిజిస్టర్ కీలకమన్నారు. క్వాలిటీ కంట్రోల్ రిజిస్టర్‌ను ఏర్పాటు చేసి, టీమ్ సభ్యులతో సంతకాలు చేయించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ మండల విద్యా శాఖాధికారి 2 రమా రజని, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు ఢీకొని వ్యక్తి మృతి


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఆలమూరు: జొన్నాడ వద్ద 216ఏ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. నిడదవోలు మండలం కంసాలిపాలేనికి చెందిన కాపకాయల వెంకటేశ్వరరావు (47) కొంత కాలం నుంచి తన అత్తవారి ఊరు మూలస్థాన అగ్రహారంలో భార్యాబిడ్డలతో కలిసి ఉంటున్నాడు. వరి విత్తనాల కోసం మోటార్ సైకిల్‌పై జొన్నాడ వెళ్లి, శుక్రవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో తిరిగి వస్తున్నాడు. జొన్నాడ ఆంజనేయ స్వామి ఆలయం కూడలి వద్ద రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వైపు వెళ్తున్న కారు అతడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావును ఎన్‌హెచ్ అంబులెన్సులో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. ఈ ప్రమాదంలో డివైడర్‌ను ఢీకొని కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలు, ఒక చిన్నారి సురక్షితంగా బయటపడ్డారు. ఎస్సై ఎస్.శివప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

శతాధిక వృద్ధుడి మృతి


విసరపు అబ్బాయి (పాత చిత్రం)

పిఠాపురం: పట్టణంలోని కత్తులగూడెం ప్రాంతానికి చెందిన శతాధిక వృద్ధుడు విసరపు అబ్బాయి అలియాస్ వెంకట్రావు (102) శనివారం మృతి చెందాడు. ఆయనకు ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఐదేళ్ల క్రితం మృతి చెందింది. చనిపోయేంత వరకూ ఆయన ఆరోగ్యంగా ఉన్నట్టు బంధువులు తెలిపారు.


సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ చైర్మన్ కిరణ్ కుమార్


సదస్సులో పాల్గొన్న నిరుద్యోగులు

శిక్షణతోనే భవితకు నిచ్చెన

- సాధనతోనే విజయం
- ప్రణాళికతో చదివితేనే కొలువు
- విద్యావేత్తల సూచన
- ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్
- సాక్షి మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్స్ ఆధ్వర్యాన గ్రూప్–2 ఉద్యోగాల సాధనపై అవగాహన సదస్సు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): చక్కని ప్రణాళికతో చదివితే కోరుకున్న కొలువు సులువుగా సాధించవచ్చని పలువురు విద్యావేత్తలు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో పెద్ద ఎత్తున గ్రూప్–2 పోస్టులు భర్తీ చేయనున్న నేపథ్యంలో 'సాక్షి' మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ (హైదరాబాద్) ఆధ్వర్యాన శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కాకినాడ దంటు కళాక్షేత్రంలో జరిగిన ఈ సదస్సుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న గ్రూప్–1, గ్రూప్–2 వంటి పోస్టులు వెయ్యికి పైగా భర్తీ చేసేందుకు ప్రభుత్వం త్వరలో చర్యలు తీసుకుంటుందని అధ్యాపకులు ఈ సందర్భంగా చెప్పారు. పరీక్ష విధానం, మారిన సిలబస్, విద్యార్థుల సన్నద్ధతపై అధ్యాపకులు డాక్టర్ కరీం (హిస్టరీ), సి.హరికృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ), ఎండీ పాషా (ఎకానమీ), బి.కృష్ణారెడ్డి (పాలిటీ) అవగాహన కల్పించారు. తొలుత ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ చైర్మన్ మొండెం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో వివిధ సబ్జెక్టుల్లో నిష్ణాతులైన లెజండరీ ఫ్యాకల్టీలతో కరోనా సమయంలో తాము ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించామని చెప్పారు. తమ సంస్థ ద్వారా ఆన్‌లైన్‌లో 25 వేల మంది నిరుద్యోగులు శిక్షణ పొందారని, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వేలాది మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. అనంతరం సదస్సుకు హాజరైన వారికి పరీక్ష నిర్వహించి స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో నాయుడు స్టడీ సర్కిల్ నాయుడు, 'సాక్షి' బ్యూరో చీఫ్ ఎల్.శ్రీనివాసరావు, యాడ్స్ మేనేజర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పోటీ పరీక్షలో మొదటి స్థానం విజేత వరప్రసాద్‌కు స్కాలర్‌షిప్ అందిస్తున్న అతిథులు

గ్రూప్–2కు అత్యుత్తమ శిక్షణ



పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారి కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఆర్‌సీ ఎగ్జామ్స్ ద్వారా రాష్ట్రంలోనే అత్యుత్తమ శిక్షణ అందిస్తున్నాం. మా సంస్థలో అత్యుత్తమ ఫ్యాకల్టీలు బోధిస్తున్నారు. ఈ నెలలో ఏపీ గ్రూప్–2 బ్యాచ్‌కు అడ్మిషన్లు ప్రారంభించాం. హైదరాబాద్ రాలేని గృహిణులు, ప్రైవేటు ఉద్యోగులకు మొబైల్ యాప్ ద్వారా తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో శిక్షణ ఇస్తున్నాం. వివరాలకు 89850 93399, 89850 94499 నంబర్లలో సంప్రదించవచ్చు.

– మొండెం కిరణ్‌కుమార్, చైర్మన్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ, హైదరాబాద్

భవితకు భరోసా



నేను సివిల్స్ రాసి ఇంటర్వ్యూ వరకూ వెళ్లాను. గ్రూప్–1 ఉద్యోగం సాధించి రిజిస్ట్రేషన్ శాఖలో పని చేశాను. టీచింగ్‌పై మక్కువతో మూడు దశాబ్దాలుగా హిస్టరీ బోధకుడిగా పని చేస్తున్నాను. తెలంగాణ, ఢిల్లీ, బెంగళూరు, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చాను. కోవిడ్ సమయంలో పోటీ పరీక్షలకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాం. ఆర్‌సీ ఎగ్జామ్స్ పేరుతో వేలాది వీడియోలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాం.

– డాక్టర్ ఎం.అబ్దుల్ కరీం, హిస్టరీ ఫ్యాకల్టీ

ఆత్మ విశ్వాసం పెంచింది



గ్రూప్–2 పోటీ పరీక్షల్లో విజయ సాధనకు అభ్యర్థులు చేయాల్సిన కృషి, పాటించాల్సిన మెళకువలపై నిష్ణాతులైన ఫ్యాకల్టీలు చక్కగా మార్గనిర్దేశం చేశారు. ఇది మా ఆత్మ విశ్వాసాన్ని పెంచింది. పోటీ పరీక్షలకు తొలిసారిగా హాజరయ్యే వారు సైతం తక్కువ సమయంలో ఎలా విజయం సాధించవచ్చనే అంశాలను అర్థమయ్యేలా చక్కగా వివరించారు.

– డి.నాగకృష్ణ, బీకాం

'సాక్షి'కి కృతజ్ఞతలు



గ్రూప్–2 ఉద్యోగం సాధించాలంటే ఎలాంటి వ్యూహాలు అనుసరించాలో ఈ సదస్సు ద్వారా అవగతమైంది. ఏయే సబ్జెక్టులపై ఎలా ఫోకస్ చేయాలనే అంశాలపై స్పష్టత వచ్చింది. ప్రిలిమినరీ, మెయిన్స్ రెండింటికీ ఒకే దఫా ఎలా సన్నద్ధం కావాలో అంచనా ఏర్పడింది. ఈ సదస్సు ఏర్పాటు చేసిన 'సాక్షి' మీడియాకు కృతజ్ఞతలు.

– కె.జ్ఞానగేశ్వరి, కాకినాడ

విభిన్న ఆలోచనలతో సన్నద్ధం కావాలి



పోటీ పరీక్షలకు లక్షల మంది దరఖాస్తు చేస్తారు. వీరిలో తక్కువ మందికి మాత్రమే గ్రూప్ సిలబస్‌పై అవగాహన ఉంటుంది. ఇందులో అంశాల పరిధిని చాలా విస్తృతంగా చదవాలి. ప్రశ్నల సరళిలో చాలా మార్పులు చేశారు. ప్రతి అంశంపై చాలా లోతుగా ఆలోచించాలి.

– బి.కృష్ణారెడ్డి, పాలిటీ ఫ్యాకల్టీ

సైన్స్ అండ్ టెక్నాలజీ కీలకం



ఏపీపీఎస్సీ మూడు నెలల క్రితమే గ్రూప్స్ సిలబస్‌లో మార్పులు చేసింది. ఇందులో సైన్స్ అండ్ టెక్నాలజీ అనేది కీలకం. దీనిని కరెంట్ అఫైర్స్‌లో భాగంగా పరిగణించాలి. ఇస్రో పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలు, ఉపగ్రహ ప్రయోగాల వంటి వాటిపై దృష్టి పెట్టాలి. ఇందులో ఏయే టాపిక్ నుంచి ఎన్ని మార్కులు వస్తాయో కూడా అవగాహన ఉండాలి.

– సి.హరికృష్ణ, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్యాకల్టీ

సమయం ప్రధానం



పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారు చక్కని ప్రణాళిక వేసుకుంటే విజయం సాధ్యమవుతుంది. పోటీ పరీక్షల్లో సమయం చాలా ప్రధానం. ఎకానమీపై గతంతో పాటు వర్తమాన అంశాలను కూడా గూగుల్‌లో ఎప్పటికప్పుడు చూస్తుండాలి. నోటిఫికేషన్ కోసం ఎదురు చూడకుండా నిరంతరం శ్రమించాలి. నోటిఫికేషన్ వచ్చాక కేవలం క్లిష్టమైన అంశాలపై దృష్టి పెట్టాలి.

– ఎండీ పాషా, ఎకానమీ ఫ్యాకల్టీ

స్ఫూర్తి కలిగించారు



అభ్యర్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు స్ఫూర్తిని కలిగించారు. ప్రణాళికాబద్ధమైన సాధనతోనే విజయం సాధ్యమవుతుందని ఉదాహరణలతో చెప్పిన తీరు అద్భుతం. గ్రూప్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఇది మంచి వరం.

– ఎస్.సూర్య, బీఎస్సీ

సాధనకు దిక్సూచి



ఉన్నత కొలువులు సాధించేందుకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ అవగాహన సదస్సు దిక్సూచిలా ఉపకరిస్తుంది. ఇలాంటి కార్యక్రమాలు 'సాక్షి' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి, నిరుద్యోగుల అభ్యున్నతికి దోహదపడాలి.

– టి.సంతోషి, బీఏ

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ.. 10 మందికి స్వల్ప గాయాలు


ప్రమాదంలో ధ్వంసమైన ఆర్టీసీ బస్సు

తాళ్లరేవు: కోరంగి పాత అయ్యప్పస్వామి ఆలయం సమీపాన 216 జాతీయ రహదారిపై అమలాపురం డిపోకు చెందిన రెండు ఆర్టీసీ బస్సులు శనివారం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు బస్సులలో ప్రయాణిస్తున్న సుమారు 10 మంది స్వల్పంగా గాయపడ్డారు. వారిని హుటాహుటిన తాళ్లరేవు సామాజిక ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స చేసి పంపించివేశారు. అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకుని, కోరింగ ఎస్సై పి.శ్రీనివాస కుమార్‌తో చర్చించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో ఎటువంటి కేసూ నమోదు చేయలేదని ఎస్సై తెలిపారు.

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం

- 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు
- ముగిసిన రీజినల్ స్పోర్ట్స్‌మీట్

రాజానగరం: చదువుతో పాటు క్రీడలకు కూడా ఆదికవి నన్నయ యూనివర్సిటీ తగిన ప్రాధాన్యం ఇస్తూ, క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. వర్సిటీలో రెండు రోజుల పాటు జరిగిన గోదావరి క్లస్టర్ అంతర్ విశ్వవిద్యాలయాల రీజినల్ స్పోర్ట్స్‌మీట్ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో జేఎన్‌టీయూకే ఉప కులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజుతో కలిసి 'నన్నయ' వీసీ పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను అభినందించారు. క్రీడాస్ఫూర్తితో పయనిస్తూ ఎంచుకున్న లక్ష్యాలను సాధించే దిశగా ముందంజ వేయాలని సూచించారు. స్టేడియంలో రూ.8.50 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో స్విమ్మింగ్‌పూల్, ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. జేఎన్‌టీయూకే వీసీ ఆచార్య ప్రసాదరాజు మాట్లాడుతూ, క్రీడలు శరీర దారుఢ్యానికే కాకుండా మేధోసంపత్తి వృద్ధికి తోడ్పడతాయని అన్నారు. తొలుత విజేతలకు ఇద్దరు వీసీలూ బహుమతులు అందజేశారు.

వీరే విజేతలు

బాస్కెట్‌బాల్ మహిళల విభాగంలో 'నన్నయ', పురుషుల విభాగంలో జేఎన్‌టీయూకే విజేతలుగా నిలిచాయి. కబడ్డీ పురుషుల విభాగంలో జేఎన్‌టీయూకే, మహిళల విభాగంలో 'నన్నయ', వాలీబాల్ (పురుషులు, స్త్రీ విభాగాలు) 'నన్నయ', చెస్ మెన్స్ విభాగంలో జేఎన్‌టీయూకే, వుమెన్స్ విభాగంలో 'నన్నయ' విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఈసీ సభ్యుడు డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ ఆచార్య కె.రమణేశ్వరి, నన్నయ, జేఎన్‌టీయూకే క్రీడా కార్యదర్శులు బి.రామ్‌గోపాల్, జి.శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న వీసీలు ఆచార్య పద్మరాజు, ఆచార్య ప్రసాదరాజు